సంగారెడ్డి

నమస్తే తెలంగాణ

ఆదివారం 21 ఏప్రిల్ 2024

SUNDAY, APRIL 21, 2024

రోడ్డుకు అడ్డంగా ముళ్లకంచె వేసి నిరసన తెలుపుతున్న యువకుడు

తాగునీటి కోసం రోడ్డుపై ముళ్ల కంచె

ఝరాసంగం, ఏప్రిల్ 20: తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఓ యువకుడు నడిరోడ్డుపై ముళ్లకంచె వేసి, ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగాడు. శనివారం మండల పరిధిలోని మాచ్నూర్ ప్రధాన రహదారిపై ముళ్ల కంచె వేయడంతో అటుగా వెళ్లే వాహనాలు ఇరువైపుల నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 15 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని, గ్రామంలోని బోరు ద్వారా కూడా నీటి సరఫరా లేదంటూ ఆ యువకుడు నిరసన వ్యక్తం చేశాడు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చేవరకు రోడ్డుపై నుంచి కదిలేది లేదని భీష్మించడంతో అటుగా వెళ్తున్న నాయకులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. బీజేపీ నాయకుడు మల్లికార్జున్ పాటిల్ ఆ యువకుడితో మాట్లాడి రేపటిలోగా తాగునీటి సమస్యను పరిష్కరించగానికి కృషి చేస్తానని నచ్చ చెప్పటంతో నిరసనను విరమించారు. అంతకుముందే కొందరు ఝరాసంగం పోలీసులకు, సంబంధిత అధికారులకు సమాచారం అందించారు.

ప్రజల వద్దకే న్యాయ సహాయం

బొల్లారం, ఏప్రిల్ 20: ప్రజల వద్దకే వచ్చి ఉచిత న్యాయ సలహాలు, సేవలు అందిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార ప్రతినిధి, అడ్వకేట్ గౌతమి అన్నారు. శనివారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీరప్ప బస్తీలోని డ్వాక్రా భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సేవ సలహా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయ సేవాసలహా కేంద్రం సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు గుర్తించి సలహాలు అందిస్తారని తెలిపారు. భార్యాభర్తల తగాదాలు, పంచాయతీలను పరిష్కరిస్తారని చెప్పారు. నిరక్షరాస్యులను చైతన్యం చేసి న్యాయ సేవాధికార సంస్థ ద్వారా లోక్ అదాలత్‌ల ద్వారా ఎలాంటి ఫలాపేక్ష లేకుండా సమస్యలు, కేసుల పరిష్కారానికి సభ్యులు సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రతి శనివారం కేంద్రం అందుబాటులో ఉంటుందని, మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్యారా లీగల్ వలంటీర్ శారద, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

దౌల్తాబాద్‌లో ఎన్నికల ప్రచారంలో బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

హత్నూర, ఏప్రిల్ 20: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు తెలిపారు. శనివారం హత్నూర మండలం చందాపూర్, బోర్పట్ల, కాసాల, రెడ్డిఖానాపూర్, దౌల్తాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను ఆదరించి గెలిపించాలని కోరారు. మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మకుండా అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్న బీజేపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, మురళీయాదవ్, నాగప్రభుగౌడ్, మహేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

జహీరాబాద్ అభివృద్ధికి ఎంపీ బీబీ పాటిల్ కృషి

కోహీర్, ఏప్రిల్ 20: ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు 2019లో అవాస్తవాలతో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌పై ఓ కేసును వేశాడని, ఆ కేసును కోర్టు శుక్రవారం కేసు కొట్టి వేసిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేశెట్టి పాటిల్ అన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతుబంధు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. చేతకానితనంతోనే హామీలు అమలుచేయడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అలాంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. అతడికి విదేశాలు తిరగడం, వ్యాపారాలు చేయడమే అలవాటుగా మారిందని ఆరోపించారు. జహీరాబాద్ అభివృద్ధికి ఎంపీ బీబీ పాటిల్ ఎంతో కృషి చేశాడని చెప్పారు. జహీరాబాద్ పట్టణంలో రూ.100కోట్లతో రైల్వే బ్రిడ్జి, అమృత్ భారత్ రైల్వే స్టేషన్ కోసం రూ.36కోట్లు, కోహీర్ రైల్వే వంతెన కోసం రూ.46కోట్లను మంజూరు చేయించారన్నారు. ఎంపీ బీబీ పాటిల్‌పై ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో పట్టణ అధికార ప్రతినిధి వీరేశ్ మడుపతి, కోశాధికారి చంద్రశేఖర్, తదితరులున్నారు.

నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

- పదేండ్ల బీజేపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు
- వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ ఖాయం
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 20: కాంగ్రెస్ ప్రజలను నమ్మించి మోసం చేసిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎమ్మార్ కన్వెన్షన్ హాలులో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీలను మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. ప్రజలు నమ్మి అధికారం ఇస్తే ప్రజలనే మోసం చేసిందని మండిపడ్డారు. బీజేపీ కేంద్రంలో పదేండ్లు పరిపాలించినా సామాన్యుల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలకు చేసిందేమి లేదన్నారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలన స్వర్ణదశ అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా జనరంజక పాలనను అందించారన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్రమైన ఇక్కట్లను ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఈ ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు పలకాలన్నారు. పక్షపాతం లేకుండా పార్టీలకతీతంగా బీఆర్ఎస్ నిధులు ఇచ్చేదని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలను దోచుకోవడంలో మునిగిపోయారని, ఎవరెన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయాన్ని ఆపలేరన్నారు. ఈ నెల 22న పటాన్‌చెరులో డివిజన్, మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు శ్రమించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, సఫానదేవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, పట్టణ అధ్యక్షులు అష్వల్, మెరాజ్‌ఖాన్, కుమార్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు

జూన్ 1 వరకు ఎగ్జిట్ పోల్స్ నిషేధం

జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జూన్ 1వ తేదీ వరకు ఎగ్జిట్ పోల్స్ నిషేధమని జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి జూన్ 1వ తేదీ సాయంత్రం ఆరున్నర గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌ను జాతీయ ఎన్నికల సంఘం నిషేధించినట్టు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన పత్రికలు, టీవీ ఇతర ప్రసార మాధ్యమాల్లో ప్రసారం చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు లోబడి జూన్ 1 వరకు ఎవరూ ఎగ్జిట్ పోల్స్ నిర్వహించవద్దని పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 126(ఏ) ప్రకారం శిక్షార్హులని స్పష్టం చేశారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్ రాజ్‌వాన్ని

రికార్డులు చూస్తున్న సునీల్‌కుమార్ రాజ్‌వాన్ని

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 20: ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్ రాజ్‌వాన్ని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో వసంతకుమారి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంసీసీ, ఎన్‌జీఆర్ఎస్, ఎలక్షన్ కంట్రోల్ రూమ్, సీ విజిల్, ఏంసీఏంసీ కేంద్రాలను పరిశీలించారు. సంగారెడ్డి, పటాన్‌చెరు సెగ్మెంట్లలో ఎన్నికల ఏర్పాట్లు, ఓటరు జాబితా ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎస్ఎస్‌టీ బృందాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభ్యర్థి తరపున ఖర్చు చేసే ప్రతి పైసాను పకడ్బందీగా ఎన్నికల వ్యయం కింద చూపించాలన్నారు. పత్రికలు, టీవీ చానళ్లలో ఎన్నికల ప్రచారం, సోషల్ మీడియా పోస్ట్‌లు, జాతీయ చానళ్ల పోస్ట్‌లు, ప్రకటనల వివరాలను రికార్డు చేయాలని మీడియా సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఘనంగా ఊట్ల పాఠశాల వార్షికోత్సవం

జిన్నారం, ఏప్రిల్ 20: మండలంలోని ఊట్ల గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు మండల నోడల్ ఆఫీసర్ కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి స్కిట్స్ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజయ్య, లింగారెడ్డి, రామచంద్రం, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణ, ప్రదీప్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరమ్మతులు చేయాలి

పుల్కల్, ఏప్రిల్ 20: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లకు శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఎంపీడీఓ ఆనంద్ మేరీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహనకు సంబంధించి ఎలాంటి మరమ్మతులున్నా వెంటనే అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో బాగు చేయించాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరైన సందర్భంగా కమిటీ చైర్మన్లు పాఠశాలలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శివలక్ష్మి, ఐకేపీ సిబ్బంది, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

హత్నూర, ఏప్రిల్ 20: మండల కేంద్రమైన హత్నూర, దౌల్తాబాద్, దౌలాపూర్, నాగులదేవులపల్లి, చీక్‌మద్దూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ డీపీఎం జయశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. వర్షాలుపడే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్, సీసీలు కల్పన, మహేశ్, పద్మవేణి తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

అనిల్‌కుమార్ కుటుంబ సభ్యుల డిమాండ్

మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

అనిల్‌కుమార్(ఫైల్)

పటాన్‌చెరు, ఏప్రిల్ 20: ఆంధ్రప్రదేశ్ డీజీపీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.అనిల్‌కుమార్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలోని దత్తాత్రేయకాలనీలోని అనిల్‌కుమార్ నివాసంలో తల్లి అమృత, కుటుంబ సభ్యులు మమత, శ్రీనాథ్, కల్పన, లక్ష్మణ్, సారా శ్రీనివాస్‌గౌడ్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దత్తాత్రేయనగర్‌లో నివసించే అనిల్‌కుమార్(42) విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ట్రైన్‌లో వారానికి ఒకరోజు ఇంటికి వచ్చేవాడు. ఈ నెల 15న విధులకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి విజయవాడకు బయలుదేరిన అనిల్‌కుమార్ 16న ఇస్నాపూర్ చౌరస్తాలో శవమై కనిపించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. పోస్ట్‌మార్టం వద్ద మృతదేహంపై గాయాలు గుర్తించామని, దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. అనిల్ కుటుంబ కలహాలతో భార్యతో ఏడేళ్లుగా దూరంగా ఉంటున్నాడు.

నకిలీ పత్రాలు సృష్టించిన ముఠా అరెస్ట్

సంగారెడ్డి, ఏప్రిల్ 20: నకిలీ పత్రాలు, ఓనర్లను సృష్టించి కోట్ల విలువ చేసే ప్లాట్లను కొల్లగొట్టేందుకు స్కెచ్ వేసిన ముఠా గుట్టును సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. బాధ్యులైన ఐదుగురిని అదుపులోకి తీసుకొని న్యాయస్థానం ఎదుట హాజరు పరిచారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ చెన్నూరి రూపేశ్ వివరాలు వెల్లడించారు. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న కరుపోతుల మహేశ్ 2023 జనవరిలో అమీన్‌పూర్‌లో 120గజాల ప్లాట్‌ను ఎస్.బి. పరమేశ్ నుంచి కొనుగోలు చేశాడు. అదే కాలనీలో నివాసం ఉంటున్న తిరుపతి రాథోడ్, దేవేందర్‌రెడ్డి, రవిగౌడ్, దుర్గాప్రసాద్, సుబ్బారావు పక్కా ప్రణాళికతో చాలాకాలంగా ఖాళీగా ఉన్న కరుపోతుల మహేశ్ 120 గజాల ప్లాట్‌ను కాజేయాలని తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారు. రూ.20 లక్షలు ఇచ్చి సెటిల్మెంట్ చేసుకొమ్మని బెదిరించడం మొదలుపెట్టారు. దీనిపై కరుపోతుల మహేశ్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన అమీన్‌పూర్ పోలీసులు విచారణ చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకొని న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టారు. మరో నిందితుడు దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు

జిన్నారం, ఏప్రిల్ 20: మాదారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పది మంది గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం అంజయ్య శనివారం తెలిపారు. ప్రాథమిక పాఠశాల నుంచి 14 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా పది మంది విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం అంజయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

12 మందిపై కేసు నమోదు

రామచంద్రాపురం, ఏప్రిల్ 20: ట్రాఫిక్ నిబంధనలు పాటించని 12 మందిపై ఆర్సీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగంపల్లి సిగ్నల్ పాయింట్ వద్ద ట్రాఫిక్ ఎస్సై ప్రదీప్ నేతృత్వంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా భెల్ మెయిన్ గేట్ నుంచి లింగంపల్లి బస్‌స్టాండ్ వైపునకు రాంగ్ రూట్‌లో అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన వాహనదారులను పట్టుకొని కేసు నమోదు చేశారు. అనంతరం వారిని కౌన్సెలింగ్ కోసం మాదాపూర్ ట్రాఫిక్ పీఎస్‌కు పంపించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 20: పాలిటెక్నిక్ విద్యను అభ్యసించేందుకు ఆసక్తిగల విద్యార్థులు పాలిసెట్ అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 22 వరకు గడువు ఉన్నదని సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు శనివారం ప్రకటనలో తెలిపారు. మే 24న అర్హత పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు రుసుం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.250, ఇతరులకు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాహన తనిఖీలు

కోహీర్, ఏప్రిల్ 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమ తరలింపును అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. శనివారం కోహీర్-కవేలి ప్రధాన రహదారిపై కార్లు, బైకులను ఆపి సోదాలు చేశారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

యువకుడి మృతి

శ్రీను(ఫైల్)

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సిర్గాపూర్, ఏప్రిల్ 20: ఇరువర్గాల ఘర్షణలో యువకుడు మృతి చెందిన ఘటన సిర్గాపూర్ సింగార్‌బొగుడ తండాలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీను(22)పై గ్రామంలోని మరో వర్గం వారు దాడి చేయడంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో గ్రామం లో విషాదం చోటు చేసుకుంది. గ్రామంలో కొత్తగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. దీనిపై శనివారం శ్రీను పిలిపించి పంచాయితీ పెట్టారు. అక్కడ మాటామాటా పెరగడంతో మరో వర్గం వారు శ్రీనుపై దాడి చేశారు. ఈ క్రమంలో శ్రీను ఆపస్మారక స్థితిలోకి వెళ్లగా స్థానికులు హుటాహుటిన సంగారెడ్డి బాలాజీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కంగ్టి సీఐ చంద్రశేఖర్, సిర్గాపూర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి సిబ్బందితో సింగార్‌బొగుడ తండాకు వెళ్లి విచారణ జరిపారు.

చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సింగార్‌బోగుడ తండాకు చెందిన శ్రీనుపై తండాకు చెందిన కాంగ్రెస్ వారు దౌర్జన్యంగా దాడి చేశారని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. శనివారం బాలాజీ దవాఖానకు వెళ్లి శ్రీను కుటుంబీకులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఎన్నికల సమయంలో కొత్త పనులు చేయించి, గొడవలకు కారకులైన పంచాయతీరాజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లోకి జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు

మంత్రి దామోదర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

రాయికోడ్, ఏప్రిల్ 20: వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి సురేశ్‌కుమార్ సమక్షంలో రాయికోడ్ మండల జడ్పీటీసీ, జిల్లా జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లికార్జున్‌పాటిల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్నపాటిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజుపాటిల్ కాంగ్రెస్‌లో చేరారు. శనివారం సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో మాజీ సర్పంచ్‌లు సంగమేశ్వర్‌పాటిల్, వినాయ్‌పాటిల్, సంతోష్‌కుమార్‌పాటిల్ సైతం కాంగ్రెస్ కండవా కప్పుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారు మాట్లాడుతూ.. సురేశ్‌కుమార్ గెలుపు కోసం పని చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగులప్ప ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

గుమ్మడిదల, ఏప్రిల్ 20: కాంగ్రెస్‌లో పలు పార్టీల నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో చేరారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు సూరారం మహేశ్‌తో పాటు పలు పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు నాగేందర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పుట్టనర్సింగ్‌రావు, వీరారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక 'ఈద్ మిలాప్'

బొల్లారం, ఏప్రిల్ 20: రంజాన్ తర్వాత మతసామరస్యానికి ప్రతీకగా 'ఈద్ మిలాప్' నిలుస్తుందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మైఏస్ఫార్ కాలనీకి చెందిన రషీద్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్‌లో మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కోలన్ రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెలరోజుల పాటు ఎంతో నిష్టగా ఉపవాసాలు పాటించి జరుపుకునే పండుగ రంజాన్ అన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ ప్రతినిధులు నాయకులను ఘనంగా సన్మానించారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

కంది, ఏప్రిల్ 20: పెరటి తోటల పెంపకంపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రైతులకు అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథకంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఐదు రోజులుగా కంది మండలంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. శనివారం మక్తఅల్లూర్‌లో పెరటి తోటల పెంపకం, ఎరువుల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలిగించారు.

కార్మికుడికి ఆర్థిక సాయం

బొల్లారం, ఏప్రిల్ 20: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో బైక్‌పై నుంచి పడి కాలు విరిగిన బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు బిట్టు యాదవ్‌ను సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆపన్న హస్తం అందిస్తూ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.8 వేలు ఆర్థికసహాయాన్ని అందించారు. కుల మతాలకు అతీతంగా తన సహాయ సహకారాలను అందిస్తానని ఆనంద్ కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ చింతా ప్రభాకర్ గారు
ఎమ్మెల్యే - సంగారెడ్డి
మా ప్రియతమ నాయకులు, సంగారెడ్డి ఎమ్మెల్యే శ్రీ చింతా ప్రభాకర్ గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
జి. నరేష్‌గౌడ్
మండల BRS యూత్ అధ్యక్షులు వెంకటాపూర్ మం. సదాశివపేట
ముహమ్మద్ సలావుద్దీన్
మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు సదాశివపేట
పెద్ద గొల్ల శ్రీహరి
తాజా మాజీ సర్పంచ్ కంభాలపల్లి BRS పార్టీ బజారు విభాగం మండలాధ్యక్షులు, సంగారెడ్డి
మహమ్మద్ బాబామ